

బూర్గుపల్లిలో పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బోయినపల్లి, డిసెంబర్ 22 : మండలంలోని బూర్గుపల్లికి చెందిన ఏఎంసీ డైరెక్టర్ గంగిపల్లి లచ్చయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఎం రవి, గుంటి శంకర్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తెలంగాణ చౌక్, డిసెంబర్ 22 : సిరిసిల్ల పట్టణం బివైనగర్‌కు చెందిన గాజుల సత్యనారాయణ మినీ వ్యాన్ ఢీకొని అక్కడిక్కడే మృతి చెందినట్లు టౌన్ సీఐ కృష్ణ ఆదివారం పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని కొత్త బస్టాండ్ వైపు తన బైక్‌పై వస్తున్న నేపథ్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద పెద్దూర్ వైపు వెళ్తున్న మినీ వ్యాన్ అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలు కాగా, అక్కడిక్కడే మృతి చెందాడు. నిర్లక్ష్యంగా వాహనం నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్ విలాసాగరం వేణును అరెస్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 22 : మండల కేంద్రంలో బైక్‌లను చోరీ చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దాసరి అజయ్ ఈ నెల 17న గొల్లపల్లిలో ఓ ఇంటి వద్ద తన పల్సర్ బైక్‌ను నిలిపి ఉంచగా, గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో శనివారం ఎల్లారెడ్డిపేట రెండో బైపాస్‌లో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన ముద్రకోల శ్రీకాంత్ బైక్ పై అనుమానాస్పదంగా తిరుతున్నట్లు గమనించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో శ్రీకాంత్ బైక్‌ను దొంగిలించి కామారెడ్డిలో టాక్ అర్జున్‌సింగ్‌కు అమ్మకానికి పెట్టినట్లు ఒప్పుకోగా, ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

క్రీస్తు జననం మానవాళికి ముక్తియానం



కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

చందుర్తి, డిసెంబర్ 22: క్రీస్తు జననం లోక ముక్తి కోసమేనని గాస్పెల్ ప్రేయర్ హాల్ వ్యవస్థాపకులు, దైవజనులు గోలి నర్సింహారెడ్డి ఉపదేశించారు. ఆదివారం మర్రిగడ్డలో సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించగా, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు శ్రీకాంత్ రెడ్డి, గోలి అరుందాస్, విశ్వాసులు గోలి రాజేందర్, బాబు, దాస్, సోలోమోను, శ్రీకాంత్, పుల్కం మధు, గోలి శ్రీనివాస్, ప్రకాశ్, సతీష్, ప్రవీణ్, కాంగ్రెస్ నేతలు హన్మంతరెడ్డి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల భూమేత కోసమే భూమాత

కలెక్టరేట్, డిసెంబర్ 22: ధరణిని తొలగించి భూమాతను ప్రభుత్వం తీసుకురావడం కాంగ్రెస్ నేతల భూమేత కోసమేనని తెలంగాణ రైతు వేదిక జిల్లా అధ్యక్షుడు పూండ్ర బాపురెడ్డి ఆరోపించారు. ఆదివారం నగరంలోని లక్ష్మీనగర్‌లో గల ఆ సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. ఏడు దశాబ్దాలుగా రైతాంగం ఎదుర్కొన్న సమస్యలను ధరణి ద్వారా కొలిక్కితెచ్చి కేసీఆర్ ప్రభుత్వం రైతుల్లో ఆనందం నింపిందన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ధరణిని తొలగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో తమ భూములకు రక్షణ ఉంటుందా అనే ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. ధరణి రద్దు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రతినిధులు మధుసూదన్ రావు, కొమ్మూరి మోహన్‌రెడ్డి, వింజపల్లి శ్రీరాములు, రఘురాంరెడ్డి, జక్కరాజు శ్రీనివాసరావు, మనోహర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

బోయినపల్లి : అసంపూర్తిగా ఉన్న వత్తైన

వంతెన నిర్మాణం పూర్తయ్యేనా..?

- ఇబ్బందుల్లో మండల ప్రజలు
- ప్రభుత్వం బిల్లు చెల్లిస్తేనే నిర్మాణం పూర్తి చేస్తామంటున్న కాంట్రాక్టర్

బోయినపల్లి, డిసెంబర్ 22 : మండలంలోని స్తంభంపల్లిలో వంతెన నిర్మాణ పనులు మధ్యలో నిలిపేశారు. దీంతో మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బోయినపల్లి నుంచి వేములవాడకు, జిల్లా కేంద్రానికి నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. ఏటా వర్ష కాలంలో వంతెన పైనుంచి వరద నీరు వెళ్తుండంతో పోలీసులు రాక పోకలను నిలిపివేస్తుంటారు. దీంతో వేములవాడ, సిరిసిల్లకు వెళ్లాలంటే దేశాయిపల్లి, రామన్నపేట, కొదురుపాక మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో దూర భారం పెరుగుతోందని, సమయం కూడా ఎక్కువ అవుతుంది. ఈ నేపథ్యంలో స్తంభంపల్లి వద్ద మినీ వంతెన వద్ద హైలెవల్ వంతెన నిర్మాణానికి 2022-23లో ఎంఆర్ఆర్ పథకం కింద రూ. కోటి 80 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌తో వర్షా కాలంలో పనులు ప్రారంభించారు. కానీ, పనులు ప్రారంభంలోనే నిలిపివేశారు. వంతెన నిర్మాణం పక్క నుంచి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేశారు. కానీ, అది కూడా గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారుల స్పందించి, వంత్తెన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి బిల్లు పంపించాం..

స్తంభంపల్లి వంత్తెన నిర్మాణం బిల్లు చెల్లింపునకు ఎంబీ రికార్డు చేసి, ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు పంపించాం. వంతెన నిర్మాణం విషయంలో కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నాం. కానీ, కంట్రాక్టర్ మిగిలిన పని పూర్తి చేయడానికి ముందుకు రావడం లేదు. ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదు. బిల్లు చెల్లిస్తేనే పని చేస్తామని అంటున్నరు.

- డీఈఈ లక్ష్మణ్‌రావు

ఒకరి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 22 : మండలంలో పలు దొంగతనాలకు కారణమైన గొల్లపల్లికి చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన మిర్యాల్‌కార్ శ్రీనివాస్ తన ఇంటి వద్ద ఉంచిన కారులోంచి ఆంప్లిఫైర్ చోరీకి గురైనట్లు ఆగస్టు 21న ఠాణాలో ఫిర్యాదు చేశాడు. అలాగే ఆగస్టు 20న గొల్లపల్లికి చెందిన బత్తుల రాములు ఇంటి ముందు పార్క్ చేసి, ఉంచిన ఆటోలో ఆంప్లిఫైర్ చోరీకి గురైనట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్టోబర్ 10వ తేదీన వెంకటాపూర్‌కు చెందిన మరాఠి లచ్చవ్వ ఇంటిలో గ్రాము బంగారం, వెండి మొలతాడు, వెండి బ్రాస్‌లెట్ చోరీ జరిగినట్లు ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఎస్ఐ రమాకాంత్ విచారణ చేశాడు. గొల్లపల్లి వడ్డెర కాలనీకి చెందిన దారంగుల గంగయ్య తానే మూడు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపాడు. దీంతో నేరస్తుడి నుంచి రెండు ఆంప్లిఫైర్లను, రూ.12 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు గంగయ్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

దొంగతనాలకు కేరాఫ్ తుమ్మనపల్లి

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్22: తుమ్మనపల్లి గ్రామం దొంగతనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మా రింది. మూడు నెలల్లో తొమ్మిది ఇండ్లలో రాత్రి పూట దుండగులు చోరీలకు పాల్పడ్డారు. తాజాగా శనివారం రాత్రి బొక్కల సత్యనారాయణరెడ్డి ఇంటి తాళం పగులగొట్టి దొంగతనం చేశారు. మూడు నెలల నుంచి ఏనుగు సత్యనారాయణరెడ్డి, గోపగాని సాయి, బోక్క ల అనిల్‌రెడ్డి, యాళ్ల క్రిష, రాచర్ల నర్సయ్య, నాంపల్లి కొమురయ్య, గొడిశాల రమేశ్ ఇండ్ల తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు హుజూరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వేములవాడ రూరల్, డిసెంబర్ 22 : మండలంలోని నూకలమర్రి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999-2000 పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ముందుగా ఆ నాటి గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలకు తమ గుర్తుగా లక్ష రూపాయలతో పాఠశాల ఆవరణలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి, పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షకు విశేష స్పందన

హౌసింగ్‌బోర్డుకాలనీ/కరీంనగర్ రూరల్, డిసెంబర్ 22: ప్రము ఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతిని పురస్కరించు కుని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో పదో తరగతి విద్యార్థు లకు ట్రినిటీ జూనియర్ కళాశాలలు ఆదివారం లెవల్-2 పరీక్ష నిర్వ హించారు. లెవల్-1 పరీక్షను వారివారి పాఠశాలలో ఈ నెల 8 నుంచి 18వరకు నిర్వహించగా 12,356 మంది విద్యార్థులు హాజర య్యారు. అందులో 2,368 మంది లెవల్-2 పరీక్షకు అర్హత సాధిం చగా, ఆదివారం నిర్వహించిన పరీక్షకు 1,889 మంది హాజరయ్యా రు. ఇందులో ఉత్తమ ప్రతిభ చూపిన మొదటి 30మందికి నగదు పారితోషికాలు అందిస్తామని, పరీక్షల్లో 80శాతానికి పైగా మార్కులు సాధించిన వారికి కళాశాల ఫీజులో వందశాతం వరకు రాయితీలు అందిస్తామని కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. లెవల్-1 పరీక్షను వారివారి పాఠశాలలో నిర్వహించడానికి సహకరించిన పాఠశాల యాజమాన్యాలు, హెచ్ ఎంలు, అధ్యాపక బృందానికి వారు ధన్యవాదాలు తెలియజేశారు.

మహా సభలను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్22: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జనవరి 25 నుంచి 28 వరకు నిర్వహిం చ తలపెట్టిన సీపీఎం రాష్ట్ర నాలువ మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి కోరారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకందలాల్ మిశ్రా భవనంలో అదివారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మహా సభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇక్కడ పార్టీ జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గీట్ల ముకందరెడ్డి, బీమీ సాహెబ్, జిల్లా కమి టీ సభ్యులు రమేశ్, తిరపతి, శ్రీకాంత్ ఉన్నారు.

గజగజ..

- చలికి వణుకుతున్న జనం
- పొద్దంతా వీస్తున్న చల్లటి గాలి
- పంటలపై ప్రభావం..

చలిమంట కాగుతున్న ప్రజలు

కోనరావుపేట, డిసెంబర్ 22 : జిల్లాలో చలి పంజా విసురుతోంది. రోజు రోజూకు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత అధి కంగా పెరుగుతుంది. దీనికి తోడు ఉదయం పొగ మంచు కురియడంతో పాటు పొద్దంతా చల్లటి వాతావరణంతో చలి గాలి వీస్తోంది. దీంతో ప్రజలు గజగజ వణుకుతు న్నారు. మూడు రోజుల నుంచి ఇలానే కొనసాగడంతో జనమంతా చలి తట్టుకునేందుకు స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తున్నారు. పల్లెల్లో ఉదయం, రాత్రి వేళల్లో చలి మంటలు కాస్తున్నారు. చలి మనుషులతో పాటు పంటలపై ప్రభావం చూపడంతో పాటుగా పశువులకు రక్షణ కరువైంది.

వణుకుతున్న జనం..

గ్రామాల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేందుకు సైతం జంకుతున్నారు. దీంతో రోజంతా ఇంటిలోనే ఉండిపోతున్నారు. వేడివేడి పదార్థాలను భుజించడంతో పపాటు టీ, వేడినీరు తాగుతున్నారు. ఇక చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. వృద్ధులు నడవడానికి ఇబ్బందులు పడి మంచానికే పరిమితం కాగా, చిన్నారులు జలబు, దగ్గుల బారిన పడుతున్నారు.



కోనరావుపేటలో ఎదుగుతున్న నారుమడి

పంటలపై చలి ప్రభావం..

రైతులు యాసంగి సీజన్‌కు సిద్ధంకాగా రైతులకు ఆదిలోనే సవాళ్లు ఎదురవుతున్నాయి. ప్రతికూల వాతావరణంతో పంటలను చీడపీడలను ఆశిస్తున్నాయి. అధికంగా చలి కారణంగా పోసిన నారుమడులు సక్రమంగా ఎదుగడం లేదు. దీంతో తెగుళ్లతో రంగుమారుతున్నాయని, రైతులు అందోళన చెందుతున్నారు. మండుల కోసం ఫర్టిలైజర్ దుకాణాల చుట్టూ తిరుగుతూ నాణ్యమైన మందులను కొనుగోలు చేసి, నారుమడులకు చల్లుతున్నారు. కానీ, వ్యవసాయాధికారులు చలి ప్రభావంతో నారుమడులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించడం లేదని రైతులు వాపోతున్నారు.

మూగజీవాల విలవిల..

ఎముకలు కొరికే చలితో మనుషులతో పాటు మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. దీంతో చలి నుంచి జీవాలను కాపాడుకునేందుకు పెంపకందారులు కలవరపడుతున్నారు. ముఖ్యంగా రైతులు పాడి పశువులు, పాలిచ్చే గేదెలను రక్షించుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాధులు ప్రబలకుండా రైతులకు తెలిసిన జాగ్రత్తలను పాటిస్తున్నారు. పశువులపై చలి ప్రభావం తట్టుకునేలా తీసుకునే జాగ్రత్తలపై పశువైద్యాధికారులు సూచనలు సలహాలు అందిస్తే బాగుంటుందని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

చలిమంట వేసుకుంటున్నం..

రెండు, మూడు రోజులుగా చలి అధికంగా పెడుతుంది. దీంతో వరి పంట వేసేందుకు నారుమడి సిద్ధం చేయగా, చలికి ఎదగడం లేదు. పొద్దుగల వెళ్లి చలినీళ్లు పూర్తిగా తొలగించి, వేడి నీళ్లు పెడుతున్నం. చలి ద్వారా రంగు మారడంతో తెగుళ్లు వస్తున్నాయి. అలాగే పాలిచ్చే ఆవులు సైతం పాలు తక్కువగా ఇస్తున్నాయి. ఆవులకు ఇటీవలే టీకాలు వేయించాం. పొద్దంతా చలివేయడంతో పాటు చల్లగా ఉండడంతో చలి మంట కాగుతున్నం.

-వాంకె మారుతి, యువ రైతు, మామిడిపల్లి(కోనరావుపేట)

రైతులు జాగ్రత్తలు పాటించాలి

రైతులు నారుమడులపై తగు జాగ్రత్తలు, సూచనలు పాటించాలి. చలి ప్రభావం అధికంగా ఉండడంతో నారు ఎదుగేందుకు ఇబ్బంది ఉంటుంది. ఉదయాన్నే వేడి నీరు అందించాలి. అలాగే క్లస్టర్ల వారీగా వ్యవసాయా విస్తారణ అధికారులు అందుబాటులో ఉంటున్నారు. వారి సూచనలు సలహాలు తీసుకోవాలి. ప్రతి మంగళవారం నిజామాబాద్ క్లస్టర్‌లో రైతు నేస్తం కార్యక్రమం జరుగుతుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- సందీప్, వ్యవసాయాధికారి, (కోనరావుపేట)

ప్రమాదకరంగా మూలమలుపు

- నిత్యం భయంతో వెళ్తుతున్న వాహనదారులు
- పట్టించుకోవాలని ప్రయాణికుల వేడుకోలు

పోతుగల్ ఆవునూర్ వెళ్లే దారి అతి ప్రమాదకంగా ఉన్న మూలమలుపు

ముస్తాబాద్, డిసెంబర్ 22 : మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి మూలమలుపు ప్రమాకరంగా ఉంది. ఈ రోడ్డు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ముస్తాబాద్, పోతుగల్, ఆవునూర్ తుర్కపల్లె, వెంకటాపూర్ నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి పోతుగల్ శివారులోని మానేర్ కాల్వ వద్ద రోడ్డు మూలమలుపు ఉంది. నిత్యం అధికారులు, స్థానికులు వివిధ పనులపై ఈ దారి గుండా వాహనాలపై వెళ్తుంటారు. ఇటీవల ఇటుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మలుపు గ్రహించక సడన్ బ్రేకులు వేయడంతో మోపెడ్‌పై వస్తున్న పోతుగల్‌కు చెందిన గీత కార్మికుడు చేపూరి కౌలాసంను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మూలమలుపు కాల్వపై వేసిన స్లాబ్ పెంచాలని, అలాగే, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

రుద్రంగి, డిసెంబర్ 22 : మండల కేంద్రంలో ప్రభుత్వం తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో భవన నిర్మాణ కార్మికుల కోసం 19 రకాల టెస్టులు చేసి, 50 రకాల ఫలితాలు పొందుతామన్నారు. కార్మికుల బరువు, ఎత్తు, బీపీ, షుగర్, కంటి, థైరాయిడ్, క్యాన్సర్, లివర్ ఫంక్షన్, గుండెకు సంబంధించి ఈసీజీ, రక్త పరీక్షలు, యూరిన్ టెస్టు వంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకొని వ్యాధిపై ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. ప్రతి ఒక్క కార్మిక కుటుంబ సభ్యులు ఉచిత వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదిందిన చల్మెడ..

వధూవరులను ఆశీర్వదిస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ నరసింహరావు

వేములవాడ , డిసెంబర్ 22 : పట్టణానికి చెందిన పసుల వెంకటేశ్ వివాహం హారికతో భీమేశ్వర గార్డెన్‌లో ఆదివారం జరుగగా, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్, నాయకులు ఆసద్ తదితరులు ఉన్నారు.

పట్టణ బీసీ సాధికారత కమిటీ నియామకం

పట్టణ బీసీ సాధికారత కమిటీ సభ్యులు

వేములవాడ, డిసెంబర్ 22 : వేములవాడ పట్టణ బీసీ సాధికారత కమిటీని నియమించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ పొలాస నరేందర్ ఆదివారం తెలిపారు. అధ్యక్షుడిగా తూపుకారి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆర్ వెంకటేశ్, అధికార ప్రతినిధిగా గంగ శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా కనపర్తి సుధాకర్, సాగరం రాజు, కూర రవీందర్, నేరెళ్ల నారాయణగౌడ్, ప్రచార కార్యదర్శిగా గుండబోయిన రాజేందర్, కార్యదర్శులుగా కుంభం రవీందర్, మ్యాన రాజేశ్, చందనం రవీందర్, చింతల్‌తానం దేవయ్య, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మేడారం రవీందర్, కనికరపు అనిల్, గిన్నెల శ్రీనివాస్, మహ్మద్ రజాక్‌ను ఏకగ్రీవంగా ప్రకటించామని పొలాస నరేందర్ తెలిపారు.

రైతులకు ఉచితంగా ఫర్టిలైజర్ ప్యాకెట్ల వితరణ

గంభీరావుపేట, డిసెంబర్ 22 : మండలంలోని ముస్తాఫానగర్‌లో మండల జన సేన పార్టీ అధ్యక్షుడు బండ సురేందర్ 30 మంది రైతులకు ఫర్టిలైజర్ ఎరువుల ప్యాకెట్లను ఆదివారం వితరణగా అందించారు. రైతులపై అభిమానంతో ఒక ఎకరాకు సరిపడా రూ. 500 విలువ గల ఫర్టిలైజర్ (గంట మందు)ను 30 మంది రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చాయ్ దునియా కంపెనీ డైరెక్టర్ బండ సుదర్శన్, నేతలు బండ రమేశ్, శేరిపల్లి సతీష్, శివంది నాగరాజు, చిలుక నందు, శేరిపల్లి సాగర్, బండ విజయ్ తదితరులు ఉన్నారు.

ఒకరి ఆత్మహత్య

ముస్తాబాద్, డిసెంబర్ 22 : మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన వడ్డే ఎల్లయ్య (58) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసి, పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి భార్య భుదవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్, డిసెంబర్ 22: మండలంలోని ఆవునూర్‌లో బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫండ్ చెక్కులు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు పంపిణీ చేశారు. ఆదివారం బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం రిలీఫ ఫండ్ చెక్కులను బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొన్నాల పద్మారెడ్డి నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. సీనియర్ నాయకులు, బోయిని రవి, పిట్ల చంద్రయ్య, బీ వెంకట్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్, నక్క దాసరి శ్రీకాంత్, సోషల్ మీడియా వారియస్ విశ్వనాథం పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తే చర్యలు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 22 : పీడీఎస్ రైస్‌ను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ కృష్ణ హెచ్చరించారు. ఈ మేరకు.. సిరిసిల్ల పట్టణం వెంకంపేటకు చెందిన అనంతుల శ్రీనివాస్ ఇంటిలో అక్రమంగా ప్రభుత్వం పంపిణీ చేసే బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయగా ఆదివారం పోలీస్‌లు దాడులు నిర్వహించి, బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. సుమారు 40 క్వింటళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌క తరలించినట్లు పేర్కొన్నారు